

'వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించాలి'

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18: కరీంనగర్‌లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించాలని ఒలంపిక్ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సంఘం కోశాధికారి నాగిరెడ్డి సిద్దారెడ్డి సభ్యులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ వేసవిలోసమ్మర్ కోచింగ్ శిబిరాలతోపాటు కోచ్‌ల గౌరవ వేతనాన్ని కూడా అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.



నిప్పుల కుంపటి

వీణవంకలో అత్యధికంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత



- రారెత్తిస్తున్న ఎండలు
- ఇంటా బయట ఒకటే వేడి
- రాత్రి 10 గంటల వరకూ తగ్గని వేడి గాలులు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 18: రారెత్తిస్తున్న ఎండలతో జిల్లా నిప్పుల కుంపటిలా మారింది. తెల్లవారుజామున 7 గంటల నుంచే సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని చూపడం మొదలుపెట్టాడు. రాత్రి 10 గంటల వరకు కూడా ఎండ వేడిమి, వేడి గాలులను తట్టుకోలేక జనం విలవిలలాడారు. గురువారం జిల్లాలోని వీణవంక మండలంలో రికార్డుస్థాయిలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. జిల్లా అంతటా 40 డిగ్రీలకు పైన ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది. ఎండ వేడిమితో ఇంట్లో ఉండలేక... బయటకు వెళ్లలేక జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఇంటా.. బయటా భరించలేని ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. జమ్మికుంట మండలంలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా మానకొండూర్ మండలం ఈదుగట్టుపల్లిలో 43.9, గంగిపెల్లి, పోచంపలి, చిగురుమామిడి మండలం ఇందుర్తిలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొత్తపల్లిలో 43.6 డిగ్రీలు, శంకరపట్నం మండలం కొత్తగట్టులో 43.2, కరీంనగర్‌లో 42.8 డిగ్రీలు, ఇల్లందకుంట మండలం మల్యాలలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండుల విపరీతంగా ఉండడంతో మధ్యాహ్నం వేళల్లో ప్రజలు బయటకు రావడం లేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులతోపాటు ముఖ్య కూడళ్లు జనం లేక వెలవెల బోతున్నాయి. జంతువులు, పక్షులు, మూగజీవాలు ఎండ వేడిమిని తట్టుకోలేక విలవిలలాడుతున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు, వ్యాధిగ్రస్తులు వేడిమిని భరించ లేక నానా యాతనపడుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు కూడా పనిచేయడం లేదని, ఇంట్లో ఉండలేక పోతున్నామని, రాత్రి 10 గంటల వరకు కూడా వేడి గాలులు వీస్తున్నాయని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితేకానీ డొక్కాడని కూలీలు, ఆటోలు, రిక్షా కార్మికులు, వీధివ్యాపారులు, చిరువ్యాపారులు బతుకు బండిని లాగేదెట్లా అంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత గత ఏడాదితో పోల్చితే ఈయేడు 5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగినందున అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి ఉదయం 10 తర్వాత సాయంత్రం 6 గంటల వరకు రావద్దంటూ డాక్టర్లు సూచిస్తున్నారు.

కన్నుల పండువగా రామయ్య పట్టాభిషేకం



శ్రీసీతారాముల పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఇల్లందకుంట, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో రామయ్య పట్టాభి షేకాన్ని గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నిత్యవిధి అనంతరం స్వామివారి పట్టాభిషేక కార్యక్రమం జరిపించారు. సువర్ణపుష్పార్చన కార్యక్రమం వైభోవంగా నిర్వహించారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్ పాల్గొన్నారు.

● ఘనంగా హంసవాహన సేవ

శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం హంసవాహనసేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను ఘనంగా అలంకరించి హంస వాహనంపై ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్త లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి మద్దతుగా నిలవండి

● ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కొడిమ్యాల, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ప్రధాని మోదీకి మద్దతుగా నిలవాలని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని పద్మశాలీ సేవా సంఘ భవనంలో మండలంలోని వివిధ గ్రామాల కుల సంఘాల నాయకులు 150 మంది బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాషాయ కండువా కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి దొరకడం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే ఎవ్వరికీ లాభం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. రైతులను మోసం చేయడానికే ఆగస్టులో రుణమాఫీ చేస్తామంటున్నారన్నారు. తనకు ఓటు వేసి పార్లమెంటుకు పంపాలని, నరేంద్ర మోదీని మూడో సారి ప్రధానిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శోభ, అసెంబ్లీ కన్వీనర్ శ్రావణ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌యాదవ్, మండల నాయకులు రాజేశం, అంజయ్య, నర్సింహారెడ్డి, రాజు, శ్రీనివాస్, చిరంజీవి, మహేందర్ పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారితో బండి సంజయ్‌కుమార్

నామినేషన్ల ప్రక్రియ షురూ..

కరీంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ గురువారం ప్రారంభమైంది. కలెక్టర్ ఛాంబర్‌లో కరీంనగర్ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి 100 మీటర్ల దూరం వరకు ప్రజలను అనుమతించారు. మొదటి రోజు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను సమర్పించారు. తొలి నామినేషన్‌ను నగరంలోని విద్యానగర్‌కు చెందిన కోట శ్యాంకుమార్ స్వతంత్ర అభ్యర్థిగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన పొత్తూరి రాజేందర్ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల అధికారికి అందజేశారు. నామినేషన్ల దాఖలు చేసేందుకు వచ్చిన వారికి హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి నామినేషన్ పత్రాలను అందుబాటులో ఉంచారు. అదనపు కలెక్టర్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నామినేషన్ల పత్రాలను పరిశీలించారు. శుక్రవారం బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్‌కుమార్ నామినేషన్ వేస్తారు.



ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ

● మంత్రి పొన్నం ప్రభాకర్



అలుగునూర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్, ఏప్రిల్ 18: రైతులకు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అలుగు నూర్‌లో మానకొండూర్ నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశం గురు వారం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చింద న్నారు.. బీజేపీ ఈ రాష్ట్రానికి, జిల్లాకి, నియోజక వర్గానికి ఏం చేసిందని గ్రామా ల్లో చర్చ పెట్టాలని కాంగ్రెస్ శ్రేణులను పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాకౌట్ దశలోనే డ క్కౌట్ అయ్యిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యేలు ఆది శ్రీనివా స్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి స త్యం హుజూ రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, కాంగ్రెస్‌నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు పాల్గొన్నారు.

● కష్టపడే ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం దక్కుతుందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలకు సమయం తక్కువగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ప్రవేశపెట్టి పక్కాగా అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. 23వ తేదీ నుంచి ప్రతి మండలంలో జరిగే ప్రచారానికి రానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేయాలన్నారు.

● ఎస్సారార్ మైదానంలో వాకర్స్‌కు సౌకర్యాలు కల్పిస్తాం

కరీంనగర్ అర్బన్: ఎస్సారార్ కళాశాల మైదా నంలో వాకర్స్‌కు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఉద యం ఆయన మార్నింగ్ వాక్‌లో పాల్గొని వాకర్స్‌తో మాట్లాడారు. ఈ సంద ర్భంగా పలువురు వాకర్స్ నగరంలో, మైదానంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టి కి తీసుకు వచ్చారు. కేం ద్రంలో అధికారంలో ఉండి కూడా బీజేపీ ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి తీసుకు రాలేదని విమర్శించారు.

వైకుంఠధామం పక్కనే ఉపాధి పనులు



వైకుంఠధామం గద్దెల పక్కనే కందకాలు తవ్వుతున్న కూలీలు

- కందకాల్లో నీరు నిలిస్తే వర్షాకాలంలో అంత్యక్రియలకు ఇబ్బందులు
- గ్రామస్థులు వద్దన్నా పట్టించుకోని సిబ్బంది

గంగాధర, ఏప్రిల్ 18: ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి వైకుంఠధామా నిర్మిస్తే క్షేత్రస్థాయి అధికారులు అనాలోచిత పనులతో వాటికి ప్రమాదం ఏర్పడుతోంది. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్‌లో నాలుగేళ్ల క్రితం 13 లక్షలు ఖర్చు చేసి వైకుంఠధామం నిర్మించారు. రెండు వారాలుగా దహన సంస్కారాలు నిర్వహించే గద్దెల పక్కన ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నారు. కందకాలు తీయించి వచ్చిన ఇసుకను గద్దెల చుట్టూ పోయిస్తున్నారు. వరద వస్తే కందకాల్లో నీరు నిలిచి గద్దెలు కుంగిపోయే ప్రమాదం ఉంది. పనులు నిలిపివేయాలని గ్రామస్థులు కార్యదర్శిని, ఉపాధి హామీ సిబ్బందిని కోరారు. పట్టించుకోకుండా పనుల చేస్తుండడంతో గురువారం గ్రామస్థులు అక్కడికి వచ్చి ఆందోళన నిర్వహించారు. ఊరంతా పనులున్నా ఇక్కడే ఎందుకు చేయిస్తున్నారని ఉపాధి హామీ సిబ్బందిని ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో రామును వివరణ కోరగా ఉపాధి హామీ పనులు చేస్తుండగా వైకుంఠధామానికి ప్రమాదం ఉందని గ్రామస్థులు ఈ రోజు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. పనులు జరిగే ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

పెండింగ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల అద్దె

● ఎనిమిది నెలలుగా బకాయి



గణేశ్‌నగర్, ఏప్రిల్ 18: జిల్లాలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాలకు సంబం ధించిన ఎనిమిది నెలల అద్దెను ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో యజమానులు ఇబ్బందులు పెడుతున్నారని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● జిల్లా వ్యాప్తంగా 255 కేంద్రాలు అద్దె భవనాల్లో..

జిల్లాలోని నాలుగు అంగన్వాడీ ప్రాజెక్టుల పరిధిలో 777 అంగన్వాడీ కేంద్రాలుండగా, వీటిలో 291 కేంద్రాలు సొంతభవనాల్లో, 231 ప్రైమరీ పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. మరో 255 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలకు ప్రతి నెలా చెల్లించాల్సిన అద్దె ఆరు వేల రూపాయలను కేంద్రం నుంచి వచ్చే నిధులను నుంచి విడుదల చేస్తారు. ప్రభుత్వం స్పందించి అద్దె చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కోరుతున్నారు.



రూ.7,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 18: జమ్మికుంట వ్యవసా య మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,800 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 457క్వింటాళ్ల విడి పత్తి, ఒక రైతు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,300, కనిష్ఠ ధర 6వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు



పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

హుజూరాబాద్, ఏప్రిల్ 18: పట్టణంలోని వరంగల్ రోడ్డులోని పరకాల క్రాస్ రోడ్డు వద్ద ఈ నెల 10న చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుబడ్డ రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. వాహన తనిఖీల్లో హనుమకొండ జిల్లా పరకాలలోని ఓ రైస్ మిల్లు నుంచి గుజరాత్‌కు ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 350 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. పట్టుబడిన బియ్యాన్ని ల్యాబ్‌కు పంపించగా గురువారం రేషన్ బియ్యంగా అధికారులు గుర్తించారు. బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డీటీలు వినోద్, వసంతరావు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో గుండవేణి చిన్నక్క (98) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు చేదబావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గుండవేణి చిన్నక్క బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంటి సమీపంలో కూర్చొని ముచ్చటించుకుటున్న సమయంలో ఆరుబయటకు వచ్చింది. చిన్నక్కకు సరిగా కళ్లు కనబడక పోవడంతో ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. స్థానికుల సహాయంలో కుటుంబ సభ్యులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ లాభం లేకుండా పోయినట్లు బంధువులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ కిరణ్‌కుమార్ పరిశీలించారు. చిన్నక్క కుమారుడు రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని గుమ్లాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడి గ్రామానికి చెందిన అడ్లగట్ల రాజేశం (60) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశం కొన్ని రోజులగా మతిస్థిమితం లేక తిరుతుండేవాడని తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఉదయం ఇంటి నుంచి వెళ్లి ఇంటికి రాలేదని తెలిపారు. స్థానిక రైతులు గురువారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. గ్రామానికి చెందిన అడ్లగట్ల రాజేశంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అడ్లగట్ల రాజేశం భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18: కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన గంటల మనీష్‌రెడ్డి(31) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గంటల గోపాల్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొంది ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. చిన్న కొడుకు మనీష్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా వర్క్‌ఫ్రం హోంగా పనిచేస్తున్నాడు. మనీష్‌రెడ్డి తల్లికి కంటి ఆపరేషన్ నిమిత్తం ఆమెతోపాటు గోపాల్‌రెడ్డి బుధవారం ఉదయం 6 గంటలకు వరంగల్‌కు వెళ్లారు. ఆ రోజు మధ్యాహ్నం మనీష్‌రెడ్డి సమీపంలోని తన పెదనాన్న ఇంటి వద్ద భోజనం చేసి తిరిగి ఇంటికి వచ్చాడు. గురువారం 12 గంటలకు వరంగల్ నుంచి తిరిగి వచ్చిన గోపాల్‌రెడ్డి ఇంటికి తాళం వేసి ఉండటంతో తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. ఇంట్లో మనీష్‌రెడ్డి మృతదేహం ఉరికి వేలాడుతూ కనిపించింది. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, తనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని ఒక సూసైడ్ లెటర్ టేబుల్‌పై ఉన్నట్లు గుర్తించారు. తన కొడుకు కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఉన్నాడని ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి గోపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

హార్వెస్టర్‌లో ఇరుక్కుని తెగిన చేయి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 18: రైతు హార్వెస్టర్ ద్వారా పొలం కోస్తుండగా ప్రమాదవశాత్తు హార్వెస్టర్‌లో చెయ్యి ఇరుక్కుని తెగిపోయిన సంఘటన మండలంలోని ఇదులాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వంగల సదాశివరెడ్డి గురువారం పొలం కోస్తూ వరి గొలుసులు హార్వెస్టర్‌లో వేస్తుండగా ప్రమాదవశాత్తు కుడి చేయి హార్వెస్టర్‌లో ఇరుక్కుని తెగిపోయింది. తోటి రైతులు వెంటనే తెగిన కుడిచేయితో పాటు గాయాలపాలైన సదాశివరెడ్డిని మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు.

ఐదుగురు రౌడీషీటర్ల బైండోవర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యగా ఐదుగురు రౌడీషీటర్లను తహసీల్దార్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేశామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన రౌడీషీటర్లు హస్తపురం విష్ణు, హస్తపురం అంజనేయులు, మేక శివకుమార్, హస్తపురం పవన్ కుమార్, హస్తపురం వంశీలను బైండోవర్ చేశామని పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడిపై కేసు నమోదు

గంభీరావుపేట, ఎప్రిల్ 18: బీఆర్ఎస్ నాయకుడు కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. కమలాకర్‌రెడ్డి తన భూమి కాకున్నా తనసొంత భూమి అని చెప్పి దుబ్బాక మండలం నగరం గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తికి అమ్మాడని ఎస్ఐ రాంమోహన్ వెల్లడించారు. మొదటి కిస్తి కింద భూమి కొనుగోలు చేసిన రాములు కమలాకర్‌రెడ్డికి 2 లక్షల రూపాయలు కూడా ఇచ్చాడన్నారు. ఆ భూమి కమలాకర్‌రెడ్డికి కాదని తెలిసి రాములు తాను ఇచ్చిన డబ్బులు వాపస్ ఇవ్వమని అడిగితే కమలాకర్ రెడ్డి ఇవ్వడం లేదని రాములు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. రాములు ఫిర్యాదు మేరకు కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే అదే భూమికి సంబంధించి కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు అయినట్టు, బాధితులు ఇంకెవరైనా ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ రాంమోహన్ సూచించారు.

లేగదూడలపై కుక్కల దాడి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 18: మండలంలోని పెగడపల్లిలో గురువారం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. దారివెంట వెళ్లే వారిపై దాడిచేయడంతో పాటు ఇళ్ల వద్ద కట్టేసిన లేగదూడలపై దాడి చేశాయి. దీంతో గ్రామస్థులు కుక్కలను కర్రలతో తరిమివేశారు. గ్రామంలో కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గంభీరావుపేట, ఏప్రిల్ 18: గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు తనిఖీ చేయగా, ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కన్పించారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని 4,360 రూపాయలను, ఐదు సెల్‌ఫోన్లు, మూడు బైకులను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాంమోహన్ వెల్లడించారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

రుద్రంగి మార్చి 18: అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల ఎస్సై అశోక్ తెలిపారు. రుద్రంగి మండలం అడ్డబోరు తండా గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు మంగళవారం రాత్రి గస్తీ నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో అడ్డబోరు తండా గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, వాచర్ రాజుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు రాళ్లతో దాడి చేశారు. దీంతో బాలకృష్ణ, రాజులకు గాయాలు అయ్యాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతోష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల ఎస్సై అశోక్ తెలిపారు.

మృతదేహం గుర్తింపు

ఏసీసీ, ఏప్రిల్ 18: మంచిర్యాల బస్టాండ్ ఆవరణలో ఈ నెల 16న రాత్రి మృతదేహం ఆచూకీ గుర్తించినట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేట్ గ్రామానికి చెందిన కొమ్ము రాజేందర్ (33) మంచిర్యాలలోని స్నేహితున్ని కలవడానికి వచ్చి వడదెబ్బ తగిలి మృతిచెందాడన్నారు. వ్యవసాయం చేసి జీవించే రాజేందర్ అవివాహితుడని తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి బాలిక మృతి

వీణవంక, ఏప్రిల్ 18: వీణవంక మండలంలోని గంగారం గ్రామంలో గురువారం వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడి దేవరకొండ పార్వతి (13) అనే బాలిక మృతి చెందింది. నెల్లూరు జిల్లా కందుకూరు గ్రామానికి చెందిన దేవరకొండ శ్రీనివాస్ బాతులు పెంచుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం యాసంగి కోతలు ఉన్నందున నెల రోజుల క్రితం గంగారం గ్రామానికి కుటుంబంతో సహ వచ్చాడు. బాతులను పొలాల్లో మేతకు తీసుకెళుతున్నారు. గురువారం బాతులను కుటుంబ సభ్యులు మేతకు తీసుకెళ్లారు. ఆ సమయంలో పార్వతికి దాహం వేయడంతో గంగారం గ్రామంలోని గూడేపు తిరుపతిరెడ్డి వ్యవసాయ బావిలో నీరు తాగేందుకు దిగింది. ఈ క్రమంలో పార్వతి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై తోట తిరుపతి కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొడిమ్యాల, ఏప్రిల్ 18: మండలంలోని నల్లగొండ శివారులో మామిడి తోట పక్కన గుట్టపైన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండి నీలి రంగు జీన్ ప్యాంట్, మెడలో మల్లన్న స్వామి తాడు ధరించిన పురుష మృతదేహం ఉందని గ్రామ ప్రత్యేక అధికారి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సుప్రీంకోర్టును అవమానించేలా మంత్రి పొన్నం వ్యాఖ్యలు

● బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 18: సుప్రీంకోర్టును అవమానించేలా మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు ఉన్నాయని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కాం నిందితుడు, వ్యాపార వేత్త శరత్‌చంద్రారెడ్డి బీజేపీకి 500 కోట్ల ఎలక్టోరల్ బాండ్‌లు ఇవ్వగానే బెయిల్ వచ్చిందంటూ మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పొన్నం వ్యాఖ్యలను న్యాయస్థానం సుమోటాగా తీసుకుని ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్టోరల్ బాండ్స్‌కు, బెయిల్‌కు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో ఏ సర్వేలు చూసినా బీజేపీకి 400 సీట్లు వస్తాయని తేలడంతో కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ జాతీయ పార్టీలతో పాటు స్థానిక పార్టీలకు సైతం వచ్చాయన్నారు. రాష్ట్రంలో బండి సంజయ్ పోరాటంతోనే కేసీఆర్‌పై వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారన్నారు. అంతే తప్ప పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఏనాడూ పోరాటం చేయలేదన్నారు. కరీంనగర్ ఎంపీ ఎన్నికల్లో బండి సంజయ్ 5 లక్షల మెజారిటీతో గెలవబోతున్నారని తేలడంతో పొన్నంకు భయం పట్టుకుందని కుమార్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప మాట్లాడుతూ పొన్నం మంత్రి కాగానే తన స్థాయిని తానే తగ్గించుకునేలా మాట్లాడుతున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

కరీంనగర్‌లో ప్రజల్లో స్థానం లేదని పొన్నం అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ పారిపోయాడన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్ మాట్లాడుతూ బండి సంజయ్ చేసిన పోరాటాలతోనే కేసీఆర్ సర్కార్‌ను ప్రజలు గద్దె దించారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కుమ్మరి శంకర్, కరండ్ల మధూకర్, రమణారెడ్డి, సొల్లు అజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

- ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

మానకొండూర్, ఏప్రిల్ 18: మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వద్ద బుధవారం మృతి చెందిన వ్యక్తి ఆచూకీ గురువారం లభ్యమైంది. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా దొనకొండ మండలం భూమనపల్లి గ్రామానికి చెందిన మురికిపూడి చెన్నయ్య (36) అనే వ్యక్తి మేస్త్రీ పని నిమిత్తం శ్రీను అనే కాంట్రాక్టర్ వద్దకు కరీంనగర్‌కు వచ్చాడు. మద్యానికి బానిసైన చెన్నయ్య ఈ నెల 14నుంచి పనికి వెళ్లలేదు. బుధవారం మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వద్ద స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని మృతదేహం లభ్యం కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గురువారం చెన్నయ్య కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. చెన్నయ్య వడదెబ్బతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

సాయ్ క్రీడా హాస్టల్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాలో స్పోర్ట్స్ అథార్టీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాండ్ బాల్ క్రీడా హాస్టల్‌కు ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెలలో జరిగిన సాయ్ హాండ్ బాల్ ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎం.సంజీవ్ (రామడుగు), ఎన్. ఈశ్వర్ (కాటారం), ఎం.చంటి, బి.దేవేందర్ (గుల్లకోట), బి.వంశీ (గుల్లకోట) ప్రతిభ చాటి క్రీడా హాస్టల్‌కు ఎంపికయ్యారని జిల్లా హాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మన్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని సంఘం సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం, ఏప్రిల్ 18 : శంకరపట్నం మండలానికి చెందిన శ్రీనివాస్ గురువారం కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళుతుండగా కరీంనగర్ లేక్ అవుట్‌పోస్ట్ పోలీసులు రక్షించారు. శ్రీనివాస్ కుటుంబ సమస్యలతో గురువారం మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తుండగా లేక్ పోలీసులు అనుమానించి అతడిని అడ్డుకున్నారు. కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అంజన్న దీక్షాపరుడిపై ఆంక్షలు

● ఉద్యోగం నుంచి తొలగించిన ఓ ప్రైవేటు సంస్థ మేనేజర్ ● అంజన్న స్వాముల ఆందోళన

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆంజనేయ స్వామి మాల ధరించి విధులకు హాజరవుతున్న ఓ ప్రైవేటు ఉద్యోగి పట్ల మరో ఉద్యోగి ఆంక్షలు విధించాడు. నిబంధనల ప్రకారం బూట్లు వేసుకుని విధులకు హాజరు కావాలని లేకుంటే రావద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశాడు. మధ్నాహ్నం సమయంలో భిక్ష(భోజనానికి)కు అరగంట మాత్రమే సమయమంటూ వేధించాడు. అంతే కాకుండా అసభ్యకరంగా మాట్లాడుతూ ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. టూల్ కిట్ తీసువచ్చేంత వరకు ద్విచక్రవాహనం ఇవ్వనని దాన్ని స్వాధీనం చేసుకుని ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో దీక్షాపరుడు జరిగిన విషయాన్ని వీహెచ్‌పీ, బీజేపీ, అంజన్న దీక్షాపరులకు తెలియజేశాడు. వారు ఆందోళన చేపట్టగా పోలీసులు రంగప్రవేశం చేసి బాధితుడికి సారీ చెప్పించడంతో వివాదం సర్దుమణిగింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగరావు పేట గ్రామానికి చెందిన రుద్రారపు నవీన్ అనే యువకుడు జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఉన్న జియో ఫైబర్ నెట్‌వర్క్ సర్వీసర్‌గా మూడు నెలలుగా విధులు నిర్వహిస్తున్నాడు. నవీన్ ఆరు రోజుల క్రితం అంజన్న దీక్ష తీసుకుని విధులకు హాజరవుతున్నాడు. అప్పటి నుంచి కంపెనీ మేనేజర్ సురేష్ అసభ్యకరంగా మాట్లాడుతూ అవమానిస్తున్నాడు. మాల ధరించి విధులకు హాజరు కావద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశాడు, కంపెనీ నిబంధనల ప్రకారం షూ వేసుకుని రావాలని, భిక్షకు కేవలం అరగంట సమయం మాత్రమే తీసుకోవాలంటూ ఆంక్షలు విధించాడు. శ్రీరామనవమి రోజున సదరు మేనేజర్ నవీన్‌పై ఉన్న కోపంతో ఉద్యోగం నుంచి తొలగిస్తున్నానని తెలుపడంతో పాటు కంపెనీ టూల్ కిట్ ఇచ్చేంత వరకు ద్విచక్రవాహనాన్ని ఇచ్చేది లేదంటూ వాగ్వాదానికి దిగాడు. గురువారం నవీన్ అంజన్న భక్తులతో పాటు వీహెచ్‌పీ, బీజేపీ నాయకులకు విషయం తెలిపాడు. ఆగ్రహంతో వారందరూ జియో షోరూం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. మేనేజర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి నాలుగు గంటల అనంతరం మేనేజర్‌తో సారీ చెప్పించడంతో అంజన్న భక్తులు ఆందోళనను విరమించారు. జగిత్యాలలో అంజన్న భక్తుడిని అవమానించిన ఘటనను తెలుసుకున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్ బాధితునితో ఫోన్లో మాట్లాడి ధైర్యం నింపారు. ముంబైలో ఉన్న కంపెనీ యజమానికి ఫోన్ చేసి తిరిగి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.



జగిత్యాలలో ధర్నా నిర్వహిస్తున్న అంజన్న స్వాములు

గంజాయి కట్టడికి కఠిన చర్యలు

● ఖని ఏసీపీ మడక రమేష్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 18: గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో గంజాయి కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఏసీపీ మడక రమేష్ తెలిపారు. గురువారం గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టూటౌన్, కమాన్‌పూర్ స్టేషన్‌ల పరిధిలో ఈ నెలలో మూడు కేసులు నమోదు చేసి 17 మందిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. వారి వద్ద నుంచి 85,675 విలువ గల 3 కిలోల గంజాయితో పాటు ఒక బైక్, 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. అరెస్టు అయిన 17 మందిలో వారిలో 9 మంది అమ్మకం దారులు, నలుగురు వినియోగదారులు, ఇద్దరు డీలర్లు, ఒకరు కొరియర్, ఒకరు గంజాయి పండించే వ్యక్తి ఉన్నట్టు ఏసీపీ పేర్కొన్నారు. వీరంతా కమాన్‌పూర్, జూలపల్లి, గోదావరిఖని, సెంటినరీ కాలనీ, మచ్చుపేట, గుంటూరుపల్లెకు చెందిన వారని అన్నారు. పారిశ్రామిక ప్రాంతానికి గంజాయి తీసుకువస్తున్న ముఖ్యమైన వ్యక్తి గొడిశెల శివ(రూట్ శివ)ను అదుపులోకి తీసుకుని విచారించిన మీదట, ఆదిలాబాద్ జిల్లా గదెగూడ మండలం లోకారి గ్రామంలో గంజాయి పండిస్తున్న నాగోరావ్‌ను అరెస్ట్ చేసినట్టు ఏసీపీ తెలిపారు. గొడిశెల శివ, నాగోరావ్‌లను రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన ఎస్సైలు సనత్‌కుమార్, వెంకటేష్, కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, జే రమేష్, వెంకటస్వామి, రామచంద్రంలకు ఏసీపీ అవార్డులను అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోస్టర్‌ను ఏసీపీ రమేష్ ఆవిష్కరించారు. గంజాయి, కల్తీ కల్లు అమ్మకాలపై టోల్ ఫ్రీ నంబర్ 8712671111 లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈవిలేకరుల సమావేశంలో సీఐ బీ రవీందర్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ రమేష్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 18 : కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని డిల్లీ దాబా వద్ద రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి(55) మృతి చెంది ఉన్నాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించినవారు ఏఎస్ఐ చాంద్‌పాషా ఫోన్ నెంబరు 99084 40822, ఒకటో ఠాణా ఫోన్ నెంబరు 8331940591కు సమాచారం అందించాలని కోరారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు

గొల్లపల్లి, ఏప్రిల్ 18 : గొల్లపల్లి మండల కేంద్రంలోని రామాలయంలో జరుగుతున్న శ్రీ కళ్యాణ రామచంద్ర స్వామి 33వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 24 ఎడ్ల బండ్లు పోటీలో నువ్వా..నేనా అన్న రీతిలో చెమటోడ్చాయి. వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట గ్రామానికి చెందిన క్యాతం జితేందర్‌కు చెందిన ఎడ్లబండి ప్రథమ విజేతగా నిలిచింది. ద్వితీయ విజేతగా వెన్గుమట్ల గ్రామానికి చెందిన నేరెళ్ల సతీష్‌గౌడ్ నిలిచారు. తృతీయ విజేతగా గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ భాషామియా ఎడ్లబండి నిలిచింది.


వడదెబ్బతో ఒకరి మృతి



గంగారాం (ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 18: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో వడదెబ్బతో ఒకరు మృతి చెందారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మట్కం గంగారం (42) అనే వ్యక్తి గురువారం చందుర్తి మండల కేంద్రంలో పనిపై ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి గ్రామ శివారులోని మామిడి తోట వద్దకు చేరుకొని విశ్రాంతి తీసుకుంటుండగా అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు వెంటనే ద్విచక్ర వాహనంపై ఆర్ఎంపీ వైద్యుని వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గంగారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తుర్తి గ్రామం నుంచి జీవనోపాధి కోసం 20 సంవత్సరాల క్రితం గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. మృతుడికి భార్య సరోజన, కూతురు ఒక కుమారుడు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్థులు అంత్యక్రియల కోసం విరాళాలు సేకరించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ



ఆది శ్రీనివాస్ వాహనంను తనిఖీ చేస్తున్న పోలీసులు

బోయినపల్లి, ఏప్రిల్ 18: హుజూరాబాద్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ముగించుకొని వేములవాడ వస్తున్న క్రమంలో గురువారం కొదురుపాక చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వారికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకరించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

కోనరావుపేట, ఫిబ్రవరి 18: మండలంలోని మల్కపేట గుట్టపై నిర్మించిన కోదండరామస్వామి నూతన ఆలయ ప్రాంగణంలో గురువారం నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం చిన్నజీయర్ స్వామి చేతులమీదుగా ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, చల్మెడ లక్ష్మీనర్సింహారావు తెలిపారు.

అంజన్న భక్తుల కోసం రోడ్డుపై గడ్డితో నడకదారి

మల్యాల, ఏప్రిల్ 18: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగనున్న చిన్నహనుమాన్ జయంత్యుత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి నడిచి వచ్చే వేలాది మంది దీక్షాపరుల కోసం మండలంలోని నూకపల్లికి చెందిన యువకులు రహదారి పక్కన వరిగ్రాసంతో నడకమార్గం ఏర్పాటు చేస్తున్నారు. వేసవి ఎండలు మండి పోతుండడం.. రహదారిపై నడిచే భక్తుల కాళ్లకు బొబ్బలు రావడంతో వరిగ్రాసాన్ని రహదారి పక్కన పేర్చుతూ మార్గం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం వీఆర్‌కే కళాశాల నుంచి మల్యాల క్రాస్‌రోడ్డు వరకు వరి గ్రాసంతో నూకపల్లికి చెందిన ఆర్మీ శ్రీనివాస్, చందు, స్వామి, జగదీష్, మనీష్, నాంపల్లి, ఆంజనేయులు నడక మార్గం ఏర్పాటు చేస్తుండగా వరి గ్రాసంను కనకట్ల శ్రీనివాస్ సమకూర్చాడు. వరి గడ్డి గాలికి కొట్టుకుపోకుండా దానిపై నీరు చల్లుతున్నారు.



అంజన్న స్వాములు నడిచేందుకు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన గడ్డి

విధుల్లో అలసత్వం వహించిన పోలీసుల సస్పెన్షన్

సారంగాపూర్, ఏప్రిల్, 18: విధుల్లో అలసత్వం వహించినందుకు ఇద్దరు ఎస్ఐలతో పాటు హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీసులు గత సంవత్సరం ఫిబ్రవరిలో వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 70 కిలోల గంజాయిని సారంగాపూర్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న గంజాయిని అదే అంబులెన్స్‌లో ఉంచి పోలీస్‌స్టేషన్లో ఎస్సై రూమ్ సమీపంలో భద్రపరిచారు. కొద్ది రోజుల క్రితం అంబులెన్స్‌లో ఉన్న గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీన్ని గమనించిన పోలీసులు ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపారు. హుటాహుటిన ఎస్పీతో పాటు జిల్లా స్థాయి పోలీస్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేశారు. విధుల్లో అలసత్వం వహించిన అప్పటి ఎస్సై మనోహర్ రావు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎస్సై తిరుపతితో పాటు హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ టీ నరేందర్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ 1 ఐజీ ఎవి రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజన్న కోడెలకు పశుగ్రాసం వితరణ

వేములవాడ టౌన్, ఏప్రిల్ 18: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి తిప్పాపూర్ గోశాలకు పలువురు పశుగ్రాసాన్ని గురువారం అందజేశారు. ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన రాజే 1000 కేజీల గ్రాసం అందించగా, వెంకటాపురం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి 17 వందల కేజీల గ్రాసాన్ని సంబంధిత అధికారులకు అందించారు. అంతే కాకుండా శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు పశుగ్రాసం అందించాల్సిన దాతలు నాంపల్లి గుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన 3వ గోశాలకు తీసుకురావల్సిందిగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

నిలిపి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● 12 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు

గంగాధర, ఏప్రిల్ 18: గంగాధర మండలం కురిక్యాల గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం అర్ధరాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై నిలిపి ఉంచిన వ్యాన్‌ను వెనకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్ సహ మరో పది మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల డిపోకు చెందిన బస్సు(టీఎస్ 21జడ్ 0011) భద్రాచలం నుంచి కోరుట్లకు వెళ్తోంది. గంగాధర మండలం కురిక్యాల శివారు నుంచి సుమారు రాత్రి రెండు గంటల ప్రాంతంలో బస్సు వెళుతున్నది. ఆ సమయంలో ప్రధాన రహదారిపై నిలిపి ఉంచిన వ్యాను (ఎంపీ 13జీబీ 4566)ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీంతో బస్సు డ్రైవర్ మహేందర్, కండక్టర్ గంగారాంతో పాటు 10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం మేరకు ఎస్సై కిరణ్‌రెడ్డి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని కరీంనగర్‌కు తరలించారు. కోరుట్ల డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేరుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వ్యాన్‌ను డ్రైవర్ ఇండికేటర్స్ వేయకుండా రోడ్డుపై నిలిపి ఉంచడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు.



వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

రామాలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 18: వావిలాలపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిసాయి. ఉదయం నిత్య హవనం, మహాపూర్ణాహుతి, చక్ర స్నానం, సాయంత్రం శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, సప్తావరణములు, ధ్వజావరోహణ, క్షేత్రపాలక బలి, ఏకాంతసేవ శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ మేచినేని అశోక్‌రావు, కార్పొరేటర్ మేచినేని వనజ, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 18: ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ బి.యస్ రావు అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారపు అలవాట్లతో పాటు రోజు వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటామని ఆయన తెలిపారు. గురువారం వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా అందరికీ నాణ్యమైన ఆరోగ్యం అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి రోజు తాజా పండ్లను తినాలని సూచించారు. శాతవాహన విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో మొబైల్ ఫోన్ వాడకం వల్ల జరిగే నష్టాలను వివరించారు. మొబైల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో ఆహార నియమాలు సక్రమంగా పాటిస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామేశ్వరరావు, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు బార్ అసోసియేషన్ సన్మానం


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 18: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్ బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ విప్ ఆరెపల్లి మోహన్, సీనియర్ న్యాయవాదులు ఉప్పుల అంజనీప్రసాద్, ఆర్.దేవేందర్‌రెడ్డి, రాచకొండ ప్రభాకర్, కల్లెపల్లి లక్ష్మయ్య, కుసుంబ కృష్ణారావు, ఎల్.రాజేశం, కొరివి వేణుగోపాలు, జేవి వేణుగోపాల్, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, నోటరీ అసోసియేషన్, క్లర్క్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్టు, న్యాయవాదుల సమస్యలను, సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రభుత్వం దృష్టికి న్యాయవాదుల సమస్యలు, సంక్షేమ పథకాలను తీసుకెళ్లి న్యాయం జరిగేందుకు సహకరిస్తానని మంత్రి పొన్నం ప్రకటించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న పండితులు

చొప్పదండి, ఏప్రిల్ 18: మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలలో భాగంగా మొదటి రోజున అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, పుణ్యాహవచనం లాంటి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు జగన్నాథ విష్ణువర్ధనాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నమా ధవుని పవనసు ధరాజు, ప్రధానకార్యదర్శి కలకొండ వెంకటలింగారెడ్డి, ఉపాధ్యక్షుడు కాసు వేణుగోపాలరాజు, కోశాధికారి ఎల్లాగౌడ్, అశోక్, రామేశ్వర్‌రెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్స వాలకు ఎంపీటీసీ కట్టెకోళ్ళ తార 25 వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

నటుడు జబర్దస్త్ వెంకీ ప్రత్యేక పూజలు


కుటుంబ సభ్యులతో జబర్దస్త్ వెంకీ

ఇల్లందకుంట, ఏప్రిల్ 18: ఇల్లందకుంట శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నటుడు జబర్దస్త్ వెంకీ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా దర్శనానికి వస్తున్నానని తెలిపారు. ఈ మేరకు పలువురు వెంకీతో సెల్ఫీలు దిగారు.

నానో యూరియా లాభదాయకం

-ఇఫ్కో జిల్లా అధికారి బాలాజీ



రైతుకు నానో యూరియాను అందజేస్తున్న ఇఫ్కో జిల్లా అధికారి బాలాజీ

కరీంనగర్ రూరల్, ఏప్రిల్18: నానో యూరియా, నానో పిఏపీలను రైతులు పంటలకు వాడటంతో ఎంతో లాభదాయకమని ఇఫ్కో జిల్లా అధికారి బాలాజీ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గోపాల్‌పూర్ గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన ఇఫ్కో వారి రైతుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నానో ఎరువులపై అవగాహన కల్పించారు. నానో యూరియా, నానో డీఏపీలను వాడటం వలన రైతులకు సమయంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. భూసారాన్ని కాపాడినట్లుగా అవుతుందని తెలిపారు. ఒక నానో యూరియా బాటిల్ ధర రూ.225, ఒక బస్తా యూరియాతో సమానంగా పని చేస్తుందని తెలిపారు. రైతులు నానో యూరియాను అన్నిరకాల పంటలు, కూరగాయలు, తోటల మీద పురుగు మందులతో పాటు కలిపి వాడటం వల్ల రైతులకు సమయంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. నానో యూరియాను డ్రోన్ ద్వారా పిచాకారి చేసే రైతులకు సబ్సిడీ మీద ధర కూడా తగ్గింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దుర్శేడ్ ప్రాథమిక వ్యవసాయ సంఘ చైర్మన్ తిరుపతి, మండల వ్యవసాయాధికారి సత్యం, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ నగర చైర్మన్‌గా హైమద్ అలీ

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18 : నగర కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త మహమ్మద్ హైమద్ అలీని నియమిస్తూ మానకొండూరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ స్థాయి వరకు కార్యకర్తగా కొనసాగుతూ మైనార్టీల సమస్యలపై అవగాహన కలిగి ఉన్నందున హైమద్ అలీకి ఈ బాధ్యత అప్పగించామని డీసీసీ అధ్యక్షుడు తెలిపారు. ఈ సందర్భంగా హైమద్ అలీ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ మోసీన్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి'

గణేశ్‌నగర్, ఏప్రిల్ 18: దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ప్రజలకు ఉచితాలు ఇవ్వడం కాదు చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలుకు చట్టం చేస్తామని హామీ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్‌లు కోరారు. గురువారం కరీంనగర్ లోని జ్యోతినగర్ లోని బీసీ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమా వేశంలో వారు హజరై మాట్లాడుతూ దేశంలోని 70 కోట్ల మంది బీసీల ఆకాంక్షలను ప్రతి జాతీయ పార్టీ పరిగణనలోకి తీసుకొని వారి మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరారు. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో బీసీల ఊసే ఎత్తక పోవడం ఆ పార్టీకి బీసీలపై ఉన్న వ్యతిరేక వైఖరికి నిదర్శనమని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో బీసీలకు చట్ట సభల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించే డిమాండ్ చేర్చక పోతే ఆ పార్టీ కూడా బీసీల వ్యతిరేకమని ఎన్నికల్లో ఆ పార్టీ నీ కూడా బీసీలు బొంద పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కరీంనగర్ జిల్లాలోని బీసీ ఆల్ ఇండియా సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ గా చెప్పుకునే వ్యక్తి బీసీ ఉద్యమకారులను కించపరిచే విధంగా మాట్లాడడం మానుకో వాలని లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడేంట్ రచమల్ల రాజు, మహిళా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని, సరోజన, మనోజ్ కుమార్, మురళి, మెరుగు రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి ముగిసిన శిక్షణ

గణేశ్‌నగర్, ఏప్రిల్ 18: టీఎస్ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం మొదటి బ్యాచ్‌కి గురువారం శిక్షణ పూర్తయింది ఈ శిక్షణ కార్యక్రమంలో అన్ని విద్యుత్తు అవసరాల గురించి, అతి తక్కువ సమయంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించే విధానాల గురించి వివరించారు. విద్యుత్ కోతలు లేకుండా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. అనంతరం హెల్త్ డిపార్ట్‌మెంట్ వారు డాక్టర్ ప్రణవ్, శ్రీనివాస్ బృందం విచ్చేసి సీపీఆర్ గురించి చాలా వివరంగా ట్రైనీలకు అవగాహన కల్పించారు. సీపీఆర్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ ముగింపు కార్యక్రమానికి టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ ఈ వడ్లకొండ గంగాధర్, డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, ఏడీలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, మల్లేశం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు బీఆర్ఎస్ బీ ఫారం అందజేత


కేసీఆర్ నుంచి బీ ఫారం అందుకుంటున్న వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 18: కరీంనగర్ లోకసభ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్‌కుమార్‌కు బీ ఫారంను బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అందజేశారు. గురువారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ-ఫారాలతో పాటు ఎన్నికల నియమావళి మేరకు ఖర్చు చేసేందుకు రూ.95లక్షల చెక్కులను కేసీఆర్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకసభకు పోటీచేస్తున్న అభ్యర్థులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

విద్యార్థినులపై దాడి చేసిన వారిని శిక్షించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్18: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థినులపై దాడి చేసిన వారిని కఠిన శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. విద్యార్థి నులపై దాడికి నిరసనగా గురువారం నగరం లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ప్లకార్డు లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా విద్యార్థినులు దివ్యాంగులపై దాడికి పాల్పడిన ఏబీవీపీ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రోహిత్, ఎల్కటూరి ఇసాక్, రాకేష్, సద్విత్ కుమార్, రాక్షక్, శివ, గిరిచారన్, సతీష్, రాజు, శ్రీకాంత్, ఆదర్శ్, నరేష్, సాయితేజ పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం


సహనను సన్మానిస్తున్న టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 18: యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ పరీక్షల్లో 739వ ర్యాంకు సాధించిన సహనను టీఎన్‌జీవో నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ హాజరై ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్, దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సహన విధి నిర్వహణలో జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, నాగుల నరసింహస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మహిళ జేఏసీ చైర్మన్ ఇరుమల్ల శారద, సబిత, సునీత, శైలజ, సుస్మిత, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్ సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి సుమంత్‌రావు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామస్వామి, కార్యదర్శి నరసింహరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి


హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల కోసం నామినేషన్ల ప్రక్రియ మొద లైనందున కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. హుజూరాబాద్‌లో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం పార్టీ ఆధ్వర్యంలో నియమించిన ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ బాధ్యులందరూ క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తమకు కేటాయించిన పనుల్లో అలసత్వం వహించవద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి తగిన కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి ఓటు బీజేపీకి పడేలా మేనేజ్‌మెంట్ కమిటీ తగిన కృషి చేయాలని కోరారు. సమావే శంలో విజయ్‌చందర్‌రెడ్డి, మాడ గౌతమ్‌రెడ్డి, పుప్పాల రఘు, ఎర్రబెల్లి సంపత్‌రావు,కరుణాకర్, ముత్యంరావు తదితరులు పాల్గొన్నారు.

'కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి'

హుజూరాబాద్, ఏప్రిల్ 18: చెరువులు, కుంటలు, కాలువలను అక్రమంగా కబ్జాలు చేసి విక్రయిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కొలిపాక సమ్మయ్య డిమాండ్ చేశారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడారు. హుజూరాబాద్ నడిబొడ్డులో ఉన్న గంగోని కుంటలోని భూమిని దాదాపు మూడు వైపులా గత కొన్ని నెలలుగా పక్కనే భూములున్న వారు కబ్జాలు చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం సరికాదని చెప్పారు. గంగోనికుంట అక్రమణకు గురైంది నిజమేనని అధికారు లు నిర్ధారణకు వచ్చారన్నారు. రెండ్రోజుల్లో హద్దులు ఏరా ్పటు చేస్తామని అధికారులు చెప్పారన్నారు. అక్రమంగా కబ్జా చేసి సొమ్ము చేసుకుంటున్న వారిని అధికారులు గుర్తించి వాల్లా చట్టానికి గండి కొడుతున్న వారిపై పకడ్బందీ విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరంగా నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి చెరువులు, కుంటలను కాపా డాలని కోరారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ

తిమ్మాపూర్, ఏప్రిల్18: కార్యకర్తలు ఇంటింటికీ వెళుతూ ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గ స్థాయి బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోని ఇంటింటికీ తిరుగుతూ ప్రతీ ఓటరును కలవాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధి పనులను వివరించాలని చెప్పారు. మరో సారి బీజేపీని ఆదరించాలని ప్రజలకు కోరాలని సూచించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు జగదీశ్వరాచారి, అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, కోమల అంజనేయులు, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కోత విధించొద్దు

చిగురుమామిడి, ఏప్రిల్ 18: మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం తూకంలో కోత విధించొద్దని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని సుందరగిరిలో గురువారం బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఇం టింటికీ వెళుతూ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను ఆదరించాలని కోరారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు అచ్చ రవీందర్, బూత్ అధ్యక్షులు తుల్లెల వెంకటేశ్వర్లు, కాశవేని రమేశ్, పెసరి పర్శరాములు, దొంత కరుణాకర్, పొన్నం శ్రీకాంత్, గండెకుమార్, దుర్గం మహేశ్, జీరవేని నవీన్, గంగిపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలి



అక్రమంగా వెలసిన షాపులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

శంకరపట్నం, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను వ్యాపారులు స్వచ్ఛందగా తొలగించాలని ఎంపీడీవో శ్రీవాణి అన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన రహదారి నుంచి నిర్ణీత 50 ఫీట్ల దూరాన్ని అతిక్రమించి దాదాపు 30కి పైగా షాపులు ఉన్నాయన్నారు. ఇప్పటికే డ్రైనేజీ దాటి వచ్చిన దుకాణాలు, తోపుడు బండ్లు, సైన్ బోర్డులను తొలగించాలని నోటీసులు ఇచ్చి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ నెల 20లోగా రహదారికి ఇరువైపులా అక్రమంగా వెలసిన షాపులను, తోపుడు బండ్లను వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించాలన్నారు. వ్యాపారులు సహకరించక పోతే తామే రంగంలోకి దిగి అక్రమణలను తొలగించేస్తామన్నారు. ఆమె వెంట ఎంపీడీవో బషీరోద్దీన్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేదిక వైపు దూసుకొచ్చిన కార్యకర్త

- కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో వాగ్వాదం


ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ కార్యకర్త భద్రయ్య

తిమ్మాపూర్, ఏప్రిల్ 18: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో వేదికపై దూసు కురావడం కలకలం రేపింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, కాం గ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు, ఇతర నాయకులు వేదికపై కూర్చున్నారు. ఆ సమయంలో సభ ముందు కూర్చున్న మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల భద్రయ్య అనే కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త ఒక్కసారిగా వేదికపైన ఉన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వైపునకు దూసుకువెళ్లాడు. నాలుగు దశాబ్దాలుగా పోచమ్మ గుడికి ఉన్న తోవను కాలువ మహేందర్ అనే వ్యక్తి కబ్జా చేశాడని, ఈ విషయంపై రెండు నెలల కిందే ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. తోవను కబ్జా చేసిన వ్యక్తి మహేందర్‌కు అనారోగ్యంగా ఉంటే 2లక్షల 50వేల రూపాయల ఎల్‌వోసీ(లైన్ ఆఫ్ క్రెడిట్) ఒక్క రోజు ముందు ఎలా ఇస్తారని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. దీంతో వేదిక నుంచి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కిందికి దిగి గొడవలు చేయవద్దని అతడిని నెట్టివేశారు. దీంతో సమావేశంలో అలజడి చోటు చేసుకుంది. అనంతరం ఇతర కార్యకర్తలు కల్పించుకొని ఎడ్ల బద్రయ్యను అక్కడి నుంచి పంపించి వేయడంతో సమావేశం సజావుగా కొనసాగింది.

అక్రమ నిర్మాణాల తొలగింపు


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

కరీంనగర్ రూరల్, ఏప్రిల్18: మండలంలోని బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని సిటిజన్ కాలనీలో సెట్ బ్యాక్ లేకుండా నిర్మించిన ర్యాంప్‌లను గ్రామ పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. తప్పకుండా టీఎస్ బిపాస్ నుంచి అనుమతులు తీసుకుని నిర్మాణం చేసుకోవాలని తెలిపారు. సెట్ బ్యాక్ లేకుండా అక్రమ నిర్మాణాలు, ఇంటి ముందర ర్యాంప్ నిర్మాణాలు చేపడితే నోటీసులు ఇవ్వకుండా తొలగిస్తామన్నారు. అలాగే రోడ్డుపై చెత్త వేయకూడదని, వేసిన వారికి 500రూపాయల జరిమాన విదించబడునని, తడి చెత్త ఇంటి వద్ద వేరు చేసి గ్రామ పంచాయతీ చెత్త ట్రాక్టర్‌లో వేయాలని కోరారు.

ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కొమురయ్య

సభాష్‌నగర్, ఏప్రిల్ 18: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సాంబారి కొమురయ్యను నియమిస్తూ జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపెల్లి బాపయ్య ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికి కొమురయ్య కృతజ్ఞతలు తెలిపారు.

కవి సమ్మేళనం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 18: స్థానిక జాతీయ సాహిత్య పరిషత్ కార్యాలయంలో గురువారం ఆ సంస్థ కార్యవర్గ సభ్యుల కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ జిల్లా సహసంఘచాలక్ ఎలగందుల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ వైభవాన్ని చాటిచెప్పే విధంగా జాతీయ భావజాల కవిత్వం మరింత విరివిగా రాయాలని కవులకు పిలుపునిచ్చారు.

భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని, ధర్మం నాలుగు పాదాల మీద నడిచిన పవిత్ర ప్రదేశమని కొనియాడారు. జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు గాజుల రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి ప్రధాన కార్యదర్శి మందల నగేశ్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు కామారపు ప్రసాద్, కట్ట వేణుగోపాల్, గంగాధర్, శ్రీనివాస్, సంజీవయ్య, శ్రీనివాస జీయంగార్, అనంతోజు పద్మశ్రీ, పాలమాకుల శ్రీలత, చెరకు ప్రభావతి, నీలగిరి అనిత తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం భవనం ప్రారంభం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 18: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నగరశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన సంఘం మొదటి అంతస్తును ప్రారంభించారు. గురువారం స్థానిక వావిలాల పల్లిలో గల నగర సంఘం భవనంపై నిర్మించిన మొదటి అంతస్తును సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు జంపాల సంపత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల జయరాం, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎర్రబొజ్జు నర్సయ్య నగర గౌరవాధ్యక్షుడు ఔదుర్తి లక్ష్మన్ కుమార్, నగర ప్రధాన కార్యదర్శి కంది వెంకటేష్ పాల్గొన్నారు.

'గద్దర్ కూతురుకు ఎమ్మెల్సీ ఇవ్వాలి'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 18: ప్రజానౌక గద్దర్ కూతురు వెన్నెలకు ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవి ఇవ్వాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ పూసాల సంపత్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా యుద్ధ నౌక గద్దర్ మరణం తర్వాత ఆయన పేరిట కళాకారులకు గద్దర్ అవార్డులను ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని అన్నారు. రాజకీయంగా గద్దర్ కూతురును గుర్తించి గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇచ్చినప్పటికీ ఓటమి పాలైనందున ఆమెకు ఎమ్మెల్సీ పదవి లేదా ఏదైనా కార్పొరేషన్ పదవిని ఇవ్వాలని కోరారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

వీణవంక, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని వేసవి సెలవుల్లో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ పాలకురాలు లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు గురువారం ఆమె అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు లింగయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

గంగాధర, ఏప్రిల్ 18: గంగాధర మండలం గట్టుబూత్కూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంఈవో వేణుకుమార్ గురువారం విద్యాపరికరాలను పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన విద్యార్థులకు పలకలు, నోట్ బుక్స్ ఇతర పరికరాలను పంపిణీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శశికాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పరిధిలోని గుడ్డేలుగులపల్లిలో గల వర్కసైట్ పాఠశాలలోని విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు, సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, ఎంఈవో అంబటి వేణుకుమార్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది'

చిగురుమామిడి, ఏప్రిల్ 18: కాంగ్రెస్ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు.

సాయికిరణ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

రామడుగు, ఏప్రిల్ 18 : యూపీఎస్సీ ఫలితాల్లో 27వ ర్యాంకు సాధించిన సాయికిరణ్‌కు ఆదర్శంగా తీసుకోవాలని సరస్వతీ పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో తాను చదివిన పాఠశాలలో గురువారం సాయికిరణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట, ఏప్రిల్ 18: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బెంచీలను గుర్తు తెలియని యువకులు ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకో వాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మేటి సమ్మిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. పోలీస్‌లు యువకులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ

మానకొండూర్, ఏప్రిల్ 18: గట్టుదుద్దెనపల్లి సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బండపల్లి సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం రాత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, మాజీ సర్పంచ్ రాజయ్య, కార్యకర్తలు ఉన్నారు.